నెరవేరని లక్ష్యం



శివాజీ పార్క్‌లో జీవీఎంసీ అభివృద్ధి చేసిన స్కేటింగ్ రింక్



ప్రైవేట్ కోచ్‌ల ద్వారా స్కేటింగ్ రింక్‌లో పెద్ద ఎత్తున శిక్షణ పొందుతున్న చిన్నారులు

- ప్రైవేట్ కోచ్‌ల చేతుల్లో శివాజీ పార్క్ స్కేటింగ్ రింక్
- శిక్షణ పేరుతో చిన్నారుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లు
- జీవీఎంసీ ఆదాయానికి గండి
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ఎంవీపీకాలనీ: పిల్లల కోసం జీవీఎంసీ అభివృద్ధి చేసిన శివాజీ పార్క్‌లోని స్కేటింగ్ రింక్ ప్రైవేట్ కోచ్‌ల చేతిలో కీలుబొమ్మగా మారింది. రూ.60 లక్షలకు పైగా ఖర్చుతో స్కేటింగ్ రింగ్‌ను గతంలో ఆధునికీకరించింది. ఔత్సాహికులైన చిన్నారులు ఈ రింక్‌ను ఉపయోగించుకోవడం ద్వారా క్రీడల్లో ఉన్నతంగా రాణించాలని, చదువు ఒత్తిడిని తగ్గించుకుని శారీరక సౌష్టవాన్ని పెంచుకొని సేదతీరాలనేది జీవీఎంసీ లక్ష్యం. ఇందుకు అనుగుణంగా ఉచితంగా చిన్నారులకు కోచింగ్ ఇచ్చే వారు ఈ రింక్ సేవలు వినియోగించుకునే వీలుంది. ప్రస్తుతం జీవీఎంసీ లక్ష్యానికి విరుద్ధంగా రింక్ సేవలు పక్కదారి పట్టాయి. కొందరు ప్రైవేట్ కోచ్‌లు రింక్‌ను వినియోగించుకొని చిన్నారుల నుంచి రూ.లక్షలు దండుకుంటూ జీవీఎంసీ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో కార్పొరేషన్ లక్ష్యం నెరవేరలేదు.

నెలకు రూ.లక్షల్లో వసూళ్లు..

శివాజీ పార్క్ స్కేటింగ్ రింక్‌లో ప్రస్తుతం 150 నుంచి 200 మంది వరకు చిన్నారులు ప్రైవేట్ కోచ్‌ల ద్వారా శిక్షణ పొందుతున్నారు. వీరిలో ఐదేళ్ల చిన్నారుల నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరి నుంచి ప్రైవేట్ కోచ్‌లు నెలకు రూ.800 నుంచి రూ.1,200 వరకు ట్రైనింగ్ ఫీజుగా వసూలు చేస్తున్నారు. దీంతో ప్రతి నెలా లక్షల రూపాయల్లో ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. స్కేటింగ్ రింక్‌ను అభివృద్ధి చేసిన జీవీఎంసీకి మాత్రం దీని నుంచి ఎటువంటి ఆదాయం లభించడం లేదు.

కార్పొరేషన్‌కు ఆదాయం నిల్..

చిన్నారులు పార్కును వినియోగించుకునేందుకు ఎంట్రన్స్ పాస్ కింద రెండు నెలలకు చెల్లిస్తున్న రూ.150 మాత్రమే పార్కు కాంట్రాక్టర్‌కు అందుతోంది. దీంతో ఇక్కడ శిక్షణ ఇస్తున్న ప్రైవేట్ కోచ్‌లు జీవీఎంసీ ఆదాయానికి రూ.లక్షల్లో గండి కొడుతున్నారు. దీనిపై పలువురు జీవీఎంసీ అధికారుల వివరణ కోరగా.. గతంలో ప్రైవేట్ కోచ్‌లు డీడీ రూపంలో జీవీఎంసీకి కొంత నామినల్ రుసుం చెల్లించేలా ఆలోచనలు చేసినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదన్నారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించినప్పటికీ స్కేటింగ్ రింగ్ ద్వారా జీవీఎంసీకి ఎలాంటి ఆదాయం రాకపోవడం వాస్తవమేనన్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి పిల్లలకు స్కేటింగ్‌లో చక్కని శిక్షణతోపాటు జీవీఎంసీకి ఆదాయం చేకూరేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అంతర్ కళాశాలల ఖోఖో పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో గురువారం అంతర్ కళాశాలల ఖోఖో పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానం వేదికగా జరుగుతున్న క్రీడా పోటీలను ముఖ్య అతిథి ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు ప్రారంభించారు. క్రీడాకారులతో కరచాలనం చేసి ప్రోత్సహించారు. ఆయా క్రీడల్లో ఉన్నతంగా రాణించి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్ మాట్లాడుతూ ఖోఖోలో 28 కళాశాలకు చెందిన 30 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. వీరిని 16 టీమ్‌లుగా విభజించి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, వివిధ వర్సిటీలు, వర్సిటీ అనుబంధ కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు, రీసెర్చ్ స్కాలర్స్, ఎంపీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.

'కాంపిటీషన్ లా' తాజా సవరణలపై వర్క్‌షాప్



కె.పి.ఆనంద్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లాలో గురువారం 'కాంపిటీషన్ లా–తాజా సవరణలు' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నై నుంచి జాయింట్ డైరెక్టర్(లా)–రీజినల్ ఇన్‌చార్జి, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(దక్షిణ రీజన్) కె.పి.ఆనంద్ ప్రసంగిస్తూ కాంపిటీషన్ లాలో జరిగిన తాజా సవరణలపై విస్తృతమైన, సమగ్ర వివరణ ఇచ్చారు. సవరణల వల్ల వ్యాపార, న్యాయ రంగాల్లో కలిగే ప్రభావాలను ఉదాహరణల ద్వారా వివరించారు. క్లిష్టమైన న్యాయ అంశాలను, వాటి మూల సూత్రాలను విద్యార్థులకు తెలియజేశారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సీతామాణిక్యం మాట్లాడుతూ కాంపిటీషన్ లా ప్రపంచంలో సమాన అవకాశాలను కల్పించడంలో, ఆవిష్కరణను ప్రోత్సహించడంలో, వినియోగదారుల ప్రయోజనాలను రక్షించడంలో ఎంత కీలకంగా ఉందో వివరించారు. ప్రొఫెసర్ జి.రాఘవయ్య, డాక్టర్ వరప్రసాద్ రోమలా తదితరులు ప్రసంగించారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావుతో కె.పి.ఆనంద్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తమ సంస్థ కార్యక్రమాలను ఆయన వివరించారు. ఆయనను ఆచార్య శశిభూషణరావు, రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావులు సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుట్టు శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు బీఎస్‌ఆర్ నగర్ సామాజిక భవనంలో రోటరీ క్లబ్ విశాఖ పోర్టు సిటీ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చారు. ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి గురువారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ కె.వెంకటరమణ మాట్లాడుతూ ఇక్కడ 26 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు బి.శివాజీ, జి.ఎస్.రాజు, కైలాస్ అగర్వాల్, కమల్ బైద్, మాధురి, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నసమారాధన



స్వాములకు భిక్ష వడ్డిస్తున్న అచ్యుతరావు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సూర్యతేజనగర్‌లోని వేప చెట్టు కింద అయ్యప్ప స్వాములకు ఉపకార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అన్నసమారాధన ప్రారంభించారు. 18 రోజుల పాటు ఇక్కడ భిక్ష కొనసాగనుందని ఉపకార్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కంచర్ల అచ్యుతరావు తెలిపారు. ఇక్కడ రోజూ 300 మంది అయ్యప్ప మాలధారులకు భిక్ష సిద్ధం చేస్తామన్నారు. స్థానిక అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.


వీఎంఆర్‌డీఏ కల్యాణ మండపం పరిశీలన



కల్యాణ మండపంలో ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–1లోని వీఎంఆర్‌డీఏ కల్యాణ మండపాన్ని గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ సందర్శించారు. ఈ మండపం కొన్నేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న నేపథ్యంలో అక్కడి పరిస్థితులను గమనించారు. గత ప్రభుత్వం రూ.4 కోట్లతో కల్యాణ మండపం నూతన నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించడంతోపాటు పనులు ప్రారంభానికి శంకుస్థాపన సైతం చేసిన అంశాన్ని పరిశీలించారు. వీఎంఆర్‌డీఏ ఉన్నతాధికారులతో పరిశీలన చేసి పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు. పలువురు అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆహ్లాదంగా సాగర తీరం



సముద్ర తీరాన నగరవాసులు

ఏయూక్యాంపస్: వాయుగుండం నేపథ్యంలో సముద్ర తీరంలో వాతావరణంగా భిన్నంగా కనిపిస్తోంది. ఎండ తీవ్రత లేకపోవడంతో మధ్యాహ్నం వేళల్లో సైతం వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉంది. దీనికి తోడు చల్లని శీతల పవనాలు సైతం వీస్తున్నాయి. ఇటువంటి వాతావరణంలో నగరవాసులు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సాగర తీరంలో ఇసుక తిన్నెలపై సేదతీరడానికి ఆసక్తి చూపుతున్నారు. వాయుగుండం ప్రభావంతో సముద్ర కెరటాలు సైతం ఉధృతంగా వస్తున్నాయి. ఎగసి పడుతున్న కెరటాలను చూస్తూ పర్యాటకులు ఫొటోలు తీసుకుంటూ ఆనందంగా గడుపుతున్నారు.

పూలే ఆశయాలు ఆచరణీయం



జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ఆచార్యులు, విద్యార్థులు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ తదితరులు

విశాఖ విద్య: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని పూలే విగ్రహానికి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత జ్యోతిరావు పూలే మార్గాన్ని అనుసరించి బాధ్యతాయుతమైన ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ సమానత్వం సాధికారత కోసం పూలే దంపతులు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఏయూ ప్రాంగణ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య నగరాజకుమారి, ఆచార్య పద్మశ్రీ, ఆచార్య గిరిజాశంకర్, ఆచార్య ఎస్.వి జయమోహన్, ఎస్సీ ఎస్టీ బీసీ–సీ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.షారోన్‌రాజు, డీన్లు ఆచార్య అరుణ్‌కుమార్, ఎస్.హరినాథ్, అప్పారావ్, వి.ధనరాజ్, బి.మునిస్వామి, ఎ.పల్లవి, ఎస్.ఎం.యుగంధర్, సాల్మన్ బెన్ని, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు నివాళి

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పూలే చిత్రపటానికి సంస్థ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, జాయింట్ కమిషనర్, ఇన్‌చార్జి కార్యదర్శి రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. చైర్మన్ మాట్లాడుతూ దేశంలో కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు పూలే అని గుర్తుచేశారు. జేసీ మాట్లాడుతూ అణగారిన వర్గాలకు పూలే చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.

ఘనంగా పాస్టర్స్ ఫెడరేషన్ వార్షికోత్సవం



జాన్‌వెస్లీని సత్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్(ఏపీపీఎఫ్) 3వ వార్షికోత్సవం గురువారం రేసపువానిపాలెంలోని క్యూఎంబీ చర్చ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు, ఫెడరేషన్ అధ్యక్షుడు కోలమూరి ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి పాస్టర్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ రాయితీలు అందేలా చూస్తామన్నారు. క్రైస్తవులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి అభ్యున్నతికి పాటుపడతామని పేర్కొన్నారు. గౌరవ అతిథి వైఎస్సార్‌సీపీ స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఫెడరేషన్ల కన్నా ఏపీపీఎఫ్ ముందంజలో ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ సంస్థ శత వసంతాలు పూర్తి చేసుకోవాలని ఆకాంక్షించారు. స్టేట్ ప్రెసిడెంట్ కె.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ క్రైస్తవులందరూ ఇలాంటి సంస్థలను ఆదర్శంగా తీసుకొని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సంస్థ అడ్వైజర్ వై.ఎస్.థామస్‌రెడ్డి మాట్లాడుతూ అందరిలో మంచి చూడటం నీ బలహీనతైతే.. ఈ ప్రపంచంలో నిన్ను మించిన బలవంతుడు ఉండడనే మాటలను నిజం చేసేలా ప్రతి క్రైస్తవుడు ఉండాలన్నారు. కార్యక్రమంలో సుప్రీం కోర్టు న్యాయవాది ఫ్రాంక్లిన్ పాల్, ఏపీపీఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎన్.ఐ.సాల్మన్‌రాజు, విశాఖ జిల్లా కమిటీ అధ్యక్షుడు కె.సునాధ్ కుమార్, కార్యదర్శి ఎం.మాణిక్యరావు, జిల్లా ట్రెజరర్ పన్నీరు బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్.జాన్సన్, ఎ.నేతాజీ, జిల్లాల పాస్టర్లు, సంఘ కాపర్లు, క్రీస్తు సేవకులు పాల్గొన్నారు.

ఏడాకుల చెట్ల తొలగింపు



ముడసర్లోవ వద్ద తొలగించిన ఏడాకుల చెట్ల కొమ్మలు

ఆరిలోవ: ప్రజలను ఊపిరి ఆడకుండా చేసే విషపు చెట్లుగా పేరొందిన ఏడాకుల చెట్ల కొమ్మలను జీవీఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. హుద్‌హుద్ అనంతరం జీవీఎంసీ అధికారులు ముడసర్లోవ ప్రాంతంలో ఏడాకుల మొక్కలను రోడ్లకు ఇరుపక్కలా, డివైడర్లలోను నాటింపజేశారు. అవి పెరిగి విషవాయులను వెదజల్లుతున్నాయి. శీతాకాలంలో ఇవి పువ్వులతో నిండుగా ఉంటున్నాయి. వాటి నుంచి వెదజల్లే వాసనకు వృద్ధులు, పిల్లలకు శ్వాసకోశ సమస్యలు ఏర్పడుతున్నాయి. ముడసర్లోవ ప్రాంతంలో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వందల మంది వాకింగ్ చేస్తారు. ఏడాకుల చెట్ల పూత నుంచి వచ్చిన వాసనకు నడక కోసం వెళ్లే వృద్ధుల్లో కొద్ది రోజులుగా శ్వాసకోశ సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీంతో ఈ ప్రాంతంలో ఏడాకుల చెట్లను తొలగించాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు జీవీఎంసీ అధికారులకు విన్నవించారు. స్పందించిన అధికారుల ఆదేశాలతో సిబ్బంది గురువారం దీన్‌దయాల్‌పురం, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాంతంలో ఉన్న ఏడాకుల చెట్ల కొమ్మలను పూర్తిగా తొలగించారు. ముడసర్లోవ ప్రాంతంలో అన్ని చోట్ల ఉన్న ఈ చెట్లను తొలగించాలని జీవీఎంసీ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: ఆరిలోవ ఎస్ఎస్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంతపాలెం, తోటగరువు, గాంధీనగర్, బాలాజీనగర్, శ్రీహరినగర్, ముస్తఫా కాలనీ, అన్నానగర్, కైలాసనగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

రెవెన్యూ కాలనీ ఫీడర్‌లో..

విమ్స్ సబ్‌స్టేషన్ ఎస్ఎస్ 11 కేవీ రెవెన్యూ కాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, షిర్డీసాయి వెటర్నరీ కాలనీ, చలపతినగర్, సంజీవినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

'అపోలో'లో లంగ్‌లైఫ్ స్క్రీనింగ్ ప్రోగ్రాం



ప్రోగ్రాం పోస్టర్ ఆవిష్కరిస్తున్న అపోలో వైద్యులు

ఆరిలోవ: అపోలో హాస్పిటల్‌లో గురువారం లంగ్‌లైఫ్ స్క్రీనింగ్ ప్రోగ్రాంను వైద్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో అపోలో క్యాన్సర్ సెంటర్ కన్సల్టెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం కోసం దేశంలోనే తొలిసారిగా ఇక్కడ లంగ్‌లైఫ్ స్క్రీనింగ్ ప్రోగ్రాం ప్రారంభించినట్లు తెలిపారు. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించగలిగితే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చన్నారు. సుమారు 80 నుంచి 90 శాతం చుట్టలు, సిగరెట్లు తాగే వారిలో లంగ్ క్యాన్సర్ వస్తుందన్నారు. పొగ తాగే వారు ఏడాదికి ఒకసారి ఈ టెస్ట్ చేయించుకోవాలని సూచించారు. లంగ్‌లైఫ్ స్క్రీనింగ్ ప్రోగ్రాం పోస్టర్‌ను అపోలో వైద్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంకాలజీ కన్సల్టెంట్లు డాక్టర్ రాకేష్‌రెడ్డి, డాక్టర్ ప్రదీప్ పాల్గొన్నారు.

ఉద్యోగులు నైపుణ్యాలు పెంచుకోవాలి

సీతంపేట: సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు ఎప్పటికప్పుడు సంస్థ అభివృద్ధికి తోడ్పడే విషయాల గురించి తెలుసుకుంటూ, నైపుణ్యాలను పెంచుకోవాలని స్టీల్ ప్లాంట్ జనరల్ మేనేజర్ కె.వి.రావు సూచించారు. నేషనల్ హెచ్‌ఆర్‌డీ నెట్‌వర్క్ విశాఖపట్నం శాఖ గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'లెర్నింగ్ సైకిల్' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. సంస్థ యాజమాన్యాలు కూడా తమ ఉద్యోగుల పని సామర్థ్యం పెంచడం కోసం సహకరించాలన్నారు.

అవగాహనతోనే రొమ్ము క్యాన్సర్ నివారణ



మాట్లాడుతున్న ఆచార్య సీతామాణిక్యం

విశాఖ విద్య: మహిళలు అవగాహన పెంచుకుని వైద్య పరీక్షలు చేసుకుంటే రొమ్ము క్యాన్సర్‌ను నివారించవచ్చని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం అన్నారు. జాతీయ సేవా పథకం, యువరాజ్ సింగ్ ఫౌండేషన్, దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంయుక్తంగా గురువారం ఎన్ఎస్ఎస్ సమావేశంలో నిర్వహించిన రేడియేషన్ లేని రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఆమె ప్రారంభించి, మాట్లాడారు. రొమ్ము క్యాన్సర్ ఇటీవల గణనీయంగా పెరుగుతోందని, తగిన జాగ్రత్తలు వహిస్తూ తరచూ పరీక్షలు చేయించుకుంటూ మహిళలు సురక్షితంగా ఉండాలని సూచించారు. ఆధునిక పరికరాలు, చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎ.పల్లవి మాట్లాడుతూ యువతులు, మహిళలు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిబిరంలో 130 మందికి పైగా మహిళలు, యువతులు పరీక్షలు చేయించుకున్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎస్.హరినాథ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో యువత కీలకం



మాట్లాడుతున్న డాక్టర్ మురళీమోహన్

ఎంవీపీకాలనీ: పర్యావరణ పరిరక్షణలో యువత పాత్ర కీలకమని భారత ప్రజారోగ్య సంస్థ కేంద్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఎంవీవీ మురళీమోహన్ అన్నారు. ఎంవీపీ కాలనీలోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ స్కూల్‌లో వ్యాస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం క్లైమేట్ ఫర్ యూత్ యాక్షన్ అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ వాతావరణం వేడెక్కకుండా కృషి చేయాల్సిన బాధ్యత భావి యువతపై ఉందన్నారు. ప్రస్తుతం భూ వాతావరణం వేడెక్కుతోందని, ఈ స్థితిని మార్చేందుకు పర్యావరణ హితమైన విధానాలు కచ్చితత్వంతో అమలు చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ బాధ్యతను యువత ఎక్కువగా పోషించాలని, అప్పుడే భావితరాలకు కాలుష్య రహితమైన పర్యావరణం అందుతుందన్నారు. కార్యక్రమంలో వ్యాస్ కో ఆర్డినేటర్ రాజేశ్వరి, గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి రత్నం పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై విజ్ఞప్తి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును సత్కరిస్తున్న ఎన్‌ఎంయూఏ ప్రతినిధి శ్రీనివాసరావు

మద్దిలపాలెం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కృషిని మరువలేమని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును కలిసి ఘనంగా సత్కరించారు. 2018–2019 సర్క్యులర్ అమలుకు ఈహెచ్ఎస్ వల్ల ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యలను పరిష్కరించేందుకు, ఆర్టీసీ ఉద్యోగులకు పరిమితి లేని వైద్యం పునరుద్ధరణకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు శ్రీనివాసరావు తెలిపారు. డివిజన్ కార్యదర్శి ఎ.కె.శివాజీ, వాల్తేర్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు పి.జి.పతి, ఆర్.వసంతరావు, రీజినల్ జాయింట్ సెక్రటరీ కె.ఎస్.ఎన్.మూర్తి, మద్దిలపాలెం డిపో కార్యదర్శి చిన్నా, వాల్తేర్, మద్దిలపాలెం కమిటీ ముఖ్య కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇగ్నోలో సమన్వయకర్తల సమావేశం



మాట్లాడుతున్న డాక్టర్ ధర్మారావు


ఎంవీపీకాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలోని అధ్యయన కేంద్రాల సమన్వయకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఉషోదయ కూడలిలోని ప్రాంతీయ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 2024–25 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు, కొత్త కోర్సుల ప్రారంభం, ఇతర అంశాలపై కేంద్రం ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు సమన్వయకర్తలతో చర్చించారు. విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడంలో అధ్యయన కేంద్రాలు అనుసంధాన కర్తలుగా సేవలందించాలన్నారు. విద్యార్థుల్లో సాంకేతికత, నైపుణ్యం పెంచే దిశగా కొత్త మార్గదర్శకాలకు బాటలు వేయాలని కోరారు. కేంద్రం ఉపసంచాలకుడు డాక్టర్ ఇ.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

శాంతి ఆశ్రమ భూములు అప్పగించాలి

ఎంవీపీకాలనీ: ఉప్పలపాటి వివేకానంద కుటుంబ సభ్యులు గతంలో నిబంధనలకు విరుద్ధంగా లీజులు పొందిన శాంతి ఆశ్రమం భూములను సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తిరిగి అప్పగించాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శాంతి ఆశ్రమం యాజమాన్య ప్రతినిధులతో కలిసి ఆయన లాసన్స్ బే కాలనీలోని ఆశ్రమంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. యోగా, మెడిటేషన్ సెంటర్ల నిర్వహణ పేరుతో దశాబ్దాల కిందట యోగి రాఘవేంద్ర ద్వారా ఉప్పలపాటి వివేకానంద కుటుంబం శాంతి ఆశ్రమం నుంచి 6.4 ఎకరాల స్థలం లీజుగా తీసుకుందని గుర్తుచేశారు.

ఆ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా పెట్రోల్ బంక్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నిర్వహించి కమర్షియల్‌గా వాడుకున్నారన్నారు. ఈ స్థలాన్ని వెనక్కి ఇచ్చేయాలంటూ శాంతి ఆశ్రమం యాజమాన్యం కోర్టును ఆశ్రయించిందన్నారు. ఆశ్రమ స్థలాల స్వాధీనంలో కలెక్టర్, జీవీఎంసీ, పోలీస్ కమిషనర్లు యాజమాన్యానికి సహకారించాలని కోరారు. ఆశ్రమం యాజమాన్యం అధ్యక్షుడు ఆదిత్య, రాజులతోపాటు జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌గా మారిన బస్టాప్



అప్పుఘర్ బస్టాప్‌లో ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ఫుడ్ స్టాల్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఫుట్‌పాత్‌లే కాదు.. బస్టాప్‌లూ ఆక్రమణకు గురవుతున్నాయి. తాజాగా అప్పుఘర్‌లో బస్‌స్టాప్‌నే ఏకంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌గా మార్చేశారు. ప్రయాణికుల కోసం జీవీఎంసీ గతంలో ఈ బస్‌స్టాప్‌ను నిర్మించగా.. దానిని ఆక్రమించి ఓ వ్యక్తి ఫాస్ట్‌ఫుడ్ స్టాల్ పెట్టాడు. బస్‌స్టాప్‌లో బెంచీలను తన వ్యాపారం కోసం వినియోగించుకుంటున్నాడు. టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిలువెత్తు నిదర్శనంగా మారిందని, ఈ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.